క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



కొండెవరం సచివాలయ ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీడీఓ వెంకట నారాయణ సూచించారు. మండలంలోని కొండెవరం-2 సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు వివరాలను సచివాలయంలో ప్రదర్శించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మునలయ్య, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు ఉన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



గోదావరి కాలువ స్నానాల రేవులో గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయం వద్ద గోదావరి కాలువ స్నానాల రేవులో పెరిగిపోయిన గుర్రపు డెక్కను తొలగించారు. కార్తిక మాసం సందర్భంగా స్నానాలు చేసేదేలా అని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో అధికారులు బుధవారం తెలిపారు. మండలంలోని చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చిన జగ్గంపేట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మూతపడిన పాఠశాలలు

సామర్లకోట: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించాలని ఉద్యమం ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ పాఠశాల బంద్‌కు పిలుపు ఇచ్చింది. ఈమేరకు బుధవారం పట్టణ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు బంద్ చేశారు. నాయకులు బాలం ప్రవీణ్, పసుపులేటి ధనుష్, వీరబాబు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్

పిఠాపురం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు బుధవారం చేపట్టిన పాఠశాలల బంద్ పిఠాపురం నియోజకవర్గంలో పాక్షికంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జి.శ్రీకాంత్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో విద్యా సంస్థలను మూసి వేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

15న మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.వెంకట నారాయణ బుధవారం తెలిపారు. ఎంపీపీ కారే సుధ ఆధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి బీమా అందజేసిన కౌన్సిలర్

సామర్లకోట: స్థానిక బలుసులపేట 13వ వార్డుకు చెందిన మురపాక శ్రీనివాస్ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీనివాసు వైఎస్సార్ బీమా కలిగి ఉన్నాడు. దాంతో రూ.లక్ష మంజూరు అయింది. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వజ్రాయుధాలకు మెరుగులు

- విజయవంతమైన ఓటు నమోదు శిబిరాలు
- పెద్దాపురం సెగ్మెంట్‌లో 912 దరఖాస్తులు
- 613 మంది కొత్త ఓట్లకు నమోదు
- తుది జాబితా జనవరి 5న విడుదల

పెద్దాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ కృషి చేస్తోంది. ఓటు నమోదు, తొలగింపులు, సవరణ దరఖాస్తులను స్వీకరిస్తూ రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు పర్యవేక్షణలో ఈ శిబిరాలు విజయంతమయ్యాయి. పోలింగ్ స్టేషన్ ప్రామాణికంగా ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన దరఖాస్తు శిబిరాలు సమర్ధంగా సాగాయి. నియోజకవర్గంలో 200 పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరించారు. వీఆర్‌ఓ, కార్యదర్శులతో కూడిన బీఎల్‌ఓలు ఫారం 6, 7, 8లను రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరించారు. సూపర్‌వైజర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, కేంద్రాల్లో విధులను పర్యవేక్షించారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించి జనవరి ఐదో తేదీన తుది జాబితా విడుదల చేయనున్నారు.

అందరికీ ఓటు హక్కు కల్పిస్తాం..



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం. అర్హత కల్గిన అందరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన శిబిరాలు విజయవంతమయ్యాయి. డిసెంబర్ 2, 3 తేదీల్లో ఇదే తరహాలో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాం. స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి ఓటు హక్కును కల్పిస్తాం.

– జె.సీతారామారావు, ఈఆర్వో, ఆర్డీఓ, పెద్దాపురం

అందిన దరఖాస్తులివి..

నూతనంగా ఓటు హక్కు కోరుతూ ఫారం 6కి సంబంధించి పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 613 దరఖాస్తులు రాగా, మరణాలు, వలసల వెళ్లిన వారివి ఫారం 7కు సంబంధించి 67, తప్పులు సరి చేయడం, చిరునామాల మార్పులకు సంబంధించి ఫారం 8 ద్వారా 232 మంది దరఖాస్తులు చేసుకోగా మొత్తం 912 దరఖాస్తులు అందాయి.



సామర్లకోటలో ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

అర్బన్, రూరల్ పరిధిలో....

మండలం	ఫారం 6	ఫారం 7	ఫారం 8	మొత్తం
పెద్దాపురం మండలం	146	12	48	206
సామర్లకోట మండలం	213	23	92	328
పెద్దాపురం అర్బన్	150	17	55	222
సామర్లకోట అర్బన్	104	15	37	156

ఉపాధి ఆర్పీలకు శిక్షణ



ఈటీసీలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా శిక్షణకు హాజరైన రాష్ట్ర స్థాయి రిసోర్సు పర్సన్లు

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించే విధంగా రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్లకు మూడు రోజుల పాటు విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించే శిక్షణను వీడియో కాన్ఫరెన్సు ద్వారా బుధవారం రాష్ట్ర ఉపాధి హామీ సంచాలకుడు పి.చిన్నతాతయ్య ప్రారంభించారు. ఈ పథకం ద్వారా పనుల గుర్తింపు ప్రణాళికా ప్రక్రియ కింది స్థాయికి తీసుకు వెళ్లేలా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ కార్యాలయానికి చెందిన వీవీ కిరణ్ తెలిపారు. ఉపాధి హామీ రాష్ట్ర సంయుక్త కమిషనర్ మల్లెల శివప్రసాద్, హార్టీకల్చర్ సంయుక్త కమిషనర్ అశోక్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా శిక్షణ ఇచ్చారు. ఫ్యాకల్టీలు ఎం.గౌరీశంకర్, కె.సుధీర్, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీలు శ్రీదేవి పాల్గొన్ని మధ్యాహ్నం శిక్షణ తరగతులు నిర్వహించారు.. శిక్షణ పొందిన రిసోర్సు పర్సన్లు రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని శ్రీదేవి తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పిఠాపురం: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ పిఠాపురంలో జర్నలిస్టులు బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఇళ్ల స్థలా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదించినందుకు కృతజ్ఞతగా బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాత్రికేయులు క్షీరాభిషేకం చేశారు. పెద్దాపురం ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐజేయు సభ్యులు ఆర్.రాంబాబు, సీనియర్ జర్నలిస్టులు చల్లా విశ్వనాథం, సూర్యనారాయణ మాట్లాడుతూ గతమెన్నడూ జర్నలిస్టుల స్థలాల కోసం మంత్రివర్గ ఆమోదం, జీఓలు తీసుకువచ్చిన ప్రభుత్వాలు లేవన్నారు. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ఆర్డీఓ జేఎస్ రామారావుకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై వినతిపత్రం అందజేశారు.



ఎమ్మెల్యే పెండెం దొరబాబును సత్కరిస్తున్న జర్నలిస్టులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

భూ సర్వేను వేగవంతం చేయాలి

- కాకినాడ ఆర్డీఓ కిశోర్

పిఠాపురం: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిశోర్ సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వే దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలు సమగ్రంగా రికార్డుల్లో పొందుపర్చడం ద్వారా ఎక్కడా ఎటువంటి వివాదాలకు అవకాశం ఉండదన్నారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 129 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని చెప్పారు. రీ సర్వే ముగిసిన గ్రామాల్లో సర్వేకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రీ సర్వేపై వచ్చిన అభ్యంతరాలు, అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కాకినాడ ఆర్డీఓ కిశోర్

రైతుల వినతి

జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వేలో పలు అభ్యంతరాలు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఆర్డీఓను కోరారు. అభ్యంతరాలపై వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

నేటి నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..'

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నుంచి ప్రతి రోజు సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో మొదటి విడతలో 10 సచివాలయాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. దీనిలో భాగంగా సచివాలయంలో వెల్ఫేర్ స్కీమ్ బోర్డులను ఆవిష్కరించి 27 సంక్షేమ పథకాలలో ప్రజలకు లబ్ధి చేకూరిన వారి గురించి వివరించనున్నట్టు తెలిపారు. పథకాలు రాని వారు ఉంటే గుర్తిస్తామన్నారు. కార్యక్రమం ముగిసిన తదుపరి వారం రోజులల్లో వలంటీర్‌కు రోజుకి 10 మంది చొప్పున వారికి వచ్చిన పథకాలను ఈకెవైసీ అప్‌డేట్ చేసి అర్హులై పథకాలు రాని వారి వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుంటారన్నారు. మండల నోడల్ అధికారిగా ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి వ్యవహరిస్తారన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. 9వ నవర, 10న మాధవపట్నం-2, 14న మాధవపట్నం-1, 15న హుస్సేన్‌పురం, 16న గొంచాల, 17న జి.మేడపాడు-2, 20న జి. మేడపాడు-1, 21న చంద్రంపాలెం, 22న అచ్చంపేట, 23న వేట్లపాలెం-1 సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలంలో గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ బుధవారం తెలిపారు. తొలిరోజు గురువారం ఇసుకపల్లి, శుక్రవారం గోర్స, 14న అమీనాబాదు సచివాలయం-2, 15న అమీనాబాదు-1, 16న కొండెవరం-2, 17న కొత్తమూలపేట, 20న కొత్తపల్లి, 21న మూలపేట, 22న నాగులాపల్లి-1, 23న నాగులాపల్లి-2 సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పట్టణ పరిధిలోని మహిళా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మహిళా చైతన్యంతోనే ప్రగతి సాధ్యమని నమ్మిన ఆయనను గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక సీఎం జగన్ ఒక్కరేనని తెలిపారు. మహిళా ప్రజా ప్రతినిధులు సొంతంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. మహిళా కార్యక్రమాల్లో ఎప్పుడు ఆహ్వానించినా రావడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కన్వీనర్ ముడికి సోనిమేరి, కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం సాయం చెక్కుల పంపిణీ

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందు వరుసలో ఉంటున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలో బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను ఆయన పార్టీ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో 16 కుటుంబాలకు రూ.10 లక్షల 15వేలు ఆర్థిక సాయం చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మండల పరిషత్తు కో ఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, గోలి బాబ్జీ, మండపాక దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

పెద్దాపురం: అన్ని విధాల నియోజవకర్గం అభివృద్ధి సాధించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తాను పనిచేస్తున్నానని, నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, మండల్లాలోని ఆయా గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు కృషి చేయాలని దొరబాబు కోరారు. అనంతరం పలు సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, కూనపురెడ్డి స్వామి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన దవులూరి దొరబాబు

కార్తిక మాసంలో స్వామివారి దర్శన వేళల పెంపు

- పాదగయ ఈఓ శ్రీనివాసరావు
- కార్తిక మాస ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

పిఠాపురం: పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా కార్తిక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన వేళలు పెంచినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం కార్తికమాసం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసంలో ప్రతి రోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ భక్తులకు కుక్కుటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామన్నారు. సోమవారం, ఇతర పర్వదినాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఆలయం తెరచి ఉంచాతామని తెలిపారు. కార్తికమాసంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వీలుగా ఇప్పటికే పాదగయ పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్త నీటిని నింపడంతో పాటు శానిటైజ్ చేశామన్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజూ భక్తులకు అన్న ప్రసాదం, పులిహోర, మంచినీరు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలో నవర కనకదుర్గ ఆలయంలో స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు స్థానిక పంచారామ క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పారాయణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, వేమూరి చంటి, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, ఆళ్లకి రాజాల ఆధ్వర్యంలో పూజలు, కుంకుమ పూజలు జరిగాయి. వారం రోజుల పాటు నిర్వహించిన ధర్మ ప్రచార కార్యక్రమాలు బుధవారంతో ముగిసాయని ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ధర్మప్రచార కార్యక్రమాల్లో భాగంగా పారాయణలు, కుంకుమ పూజలు, భజనలు, కోలాటం నిర్వహించారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం



పిఠాపురం అర్బన్ మార్కెట్‌లో వస్తువులు విక్రయిస్తున్న మహిళ

పిఠాపురం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారం పిఠాపురంలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌లో మెప్మా మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ వస్తువులు, తినుబండారాలు, పచ్చళ్లను విక్రయించారు. మెప్మా పీడీ బి.ప్రియంవధ, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఖాళీ స్థలాలను బుధవారం ఎస్సై స్వామినాయుడుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీస్, పొల్యూషన్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల వద్ద ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు కోసం ఇప్పటి వరకూ 8 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో అర్హతలు ఉన్నవారికి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.



వాకతిప్పలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

- కార్తిక మాస ఉత్సవాలపై ట్రస్టు బోర్డు సమావేశం
- నిత్యం లక్షపత్రి పూజలు

సామర్లకోట: కార్తిక మాసంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని ట్రస్టు బోర్డు తీర్మానించింది. కార్తిక మాస ఉత్సవాల ఏర్పాట్లపై ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ట్రస్టు బోర్డు పదవీ కాలం ముగియడంతో మహాశివరాత్రి వరకు ప్రస్తుత ట్రస్టు బోర్డు కొనసాగేలా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అనుమతి తీసుకున్నారని ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు చెప్తూ దొరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈనెల 14 నుంచి డిసెంబరు 13 వరకు కార్తిక మాసోత్సవాలు జరుగుతాయని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయంలో నిత్య లక్షపత్రి పూజలు జరుగుతాయన్నారు. ఈ పూజకు రూ.2,500 దేవస్థానానికి చెల్లించి రసీదు పొందాలన్నారు. 14వ తేదీ సాయంత్రం ఆకాశ దీపంతో కార్తిక మాసోత్సవాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. కోనేటిని కొత్త నీటితో నింపనున్నట్టు ఈఓ తెలిపారు. నిత్యం ప్రసాద వితరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రమేష్‌బాబు సూచించారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, భక్త సంఘం నాయకులు చల్లా సత్తిబాబు, బీవీ రమణ ప్రస్తావించిన అంశం మేరకు కోనేటిలోకి దూకే వారిపై కేసులు నమోదు చేస్తామని, ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని, అలాగే మండపం స్తంభాలకు ఇనుప కంచే ఏర్పాటు చేస్తామని ఈఓ తెలిపారు. గత ఏడాది కంటే వైభవంగా ఉత్సవాలు జరిగేలా ఖర్చు చేసేందుకు ట్రస్టు బోర్డు తీర్మానించింది. ఈనెల 26న కార్తిక పౌర్ణమి సందర్భంగా స్వామి వారి గ్రామోత్సవం, సాయంత్రం గోదావరి హారతి, రాత్రి ఆలయం వద్ద జ్వాలా తోరణం ఉంటాయని ఈఓ తెలిపారు. 29న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా తెప్పోత్సవం ఉంటుందన్నారు. డిసెంబరు 12న కోటి దీపాలంకరణ, 13న జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి, ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, చెరుకూరి దత్తు, ఆళ్లకి రాజా పాల్గొన్నారు.



కార్తిక మాసోత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ట్రస్టు బోర్డు చైర్మన్ రమేష్‌బాబు

జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

పిఠాపురం: ఒడిశాలోని రుర్కేలాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో పిఠాపురానికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కోచ్ డి.సత్యప్రియ తెలిపారు. బాలికల విభాగంలో పవిత్ర ప్రథమ స్థానం, చంద్రిక తృతీయ స్థానం, టి.అనన్య నాల్గో స్థానం, సమంత ఐదో స్థానం కైవశం చేసుకున్నారన్నారు. బాలుర విభాగంలో వనం వెంకట రామకృష్ణ పతకం సాధించినట్టు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సత్యప్రియ